సాక్షి పల్నాడు

బుధవారం । 24 । మే । 2023



దాసాంజనేయుని సేవలో స్పీకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీదాసాంజనేయస్వామిని మంగళవారం శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ దర్శించుకుని పూజలు చేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,200 వరకు పలికింది.



సత్తా చాటిన క్రీడాకారులు

పెనమలూరు: రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం కానూరులో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు.

న్యూస్‌రీల్

సి'విల్ పవర్'

- సివిల్స్‌లో జిల్లా విద్యార్థుల సత్తా
- రెంటచింతల యువకుడికి 292వ ర్యాంకు
- అచ్చంపేట అభ్యర్థికి 550వ ర్యాంకు

రెంటచింతల: సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో జిల్లా యువకులు సత్తాచాటారు. టాప్ ర్యాంకుల్లో మెరిశారు. రెంటచింతలకు చెందిన పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి 292వ ర్యాంక్ సాధించి పల్నాటి కీర్తిప్రతిష్ఠలను నలుదిశల చాటాడు. విష్ణువర్ధన్‌రెడ్డి రెంటచింతల సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియంలో 7వ తరగతి వరకు, విజయవాడ నిర్మల హైస్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి వరకు ఇంటర్మీడియెట్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాల (ఇంద్ర టవర్స్)లో, గోవా బిట్స్ పిలానిలో బీటెక్ ఈఈఈ పూర్తిచేశాడు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌లో (ఐఎఫ్ఎస్) 2020 ఫలితాలలో నాలుగో ప్రయత్నంలోనే జాతీయస్థాయిలో 3వ ర్యాంక్ సాధించాడు. చిన్నప్పటి నుంచి సివిల్ సర్వీస్‌పై ఉన్న మక్కువ ఉన్న విష్ణు వర్ధన్‌రెడ్డి ఎప్పటికైన సివిల్ ర్యాంక్ సాధించాలనే లక్ష్యంగా పెట్టుకుని 2017లో న్యూఢిల్లీలో ఓ ప్రవేట్ శిక్షణ కేంద్రంలో చేరి కృషి, పట్టుదల, అకుంటిత దీక్షతో 5వ ప్రయత్నంలో 2022లో 292 ర్యాంక్ సాధించి పల్నాడు ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాడు. ప్రస్తుతం పుణేలో పీజీ చేస్తున్నాడు.

కుటుంబ నేపథ్యం



పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి

విష్ణువర్ధన్‌రెడ్డి తల్లిదండ్రుల స్వగ్రామం వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తండ్రి నరసింహారెడ్డి విజయవాడ కానూరులోలోని శస్త్ర అకాడమీ డైరెక్టర్‌గా, తల్లి పద్మావతి తుళ్ళూరు మండలం మందడం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీజీటీ ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. సోదరి తేజశ్రీ ఏలూరు జిల్లా పిఎస్ కొలన్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు.

సమాజసేవ చేయడమే లక్ష్యం..

ఐపీఎస్‌లో శిక్షణపొంది సమాజసేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ 292 సాధించి పల్నాడు జిల్లాకే గర్వకారణంగా నిలిచిన విష్ణువర్ధన్‌రెడ్డిని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నవీన్ చక్రవర్తి ప్రతిభ



నవీన్ చక్రవర్తి

అచ్చంపేట: తాళ్లచెరువు గ్రామానికి చెందిన రేపూడి నవీన్‌చక్రవర్తి 550వ ర్యాంకు సాధించాడు. నవీన్ తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. తండ్రి రేపూడి జయపాల్ రాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయునిగా, తల్లి విజయలక్ష్మి గుంటూరు మునిసిపల్ హైస్కూలులో సెకండరీగ్రేడ్ టీచరుగా పనిచేస్తున్నారు. 30 ఏళ్ల వయస్సు కలిగిన నవీన్‌చక్రవర్తి ప్రాథమిక విద్యను ఆర్సీఎం స్కూల్ జగ్గయ్యపేటలో, ఉన్నత విద్యను నల్లపాడు లయోలా హైస్కూలులో, జూనియర్ ఇంటర్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో, మెడిసిన్ కోర్సును సిద్ధార్థ మెడికల్ కాలేజీ విజయవాడలో పూర్తిచేశారు. అయితే డాక్టర్ ప్రాక్టీస్ చేయకుండా సివిల్స్‌లో సీటు సాధించేందుకు గత ఏడాది ఢిల్లీలో కోచింగ్ తీసుకుని ర్యాంక్ సాధించలేక పోయాడు. అయినా నిరుత్సాహ పడకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ ఏడాది కూడా ఢిల్లీలోనే కోచింగ్ తీసుకుని ర్యాంకు సాధించాడు. తాను ఐఏఎస్, ఐపీఎస్ , ఐఆర్ఎస్‌లలో ఏదో ఒకటి చేయాలన్న ఆలోచనలో ఉన్నానని, వచ్చిన ర్యాంకును బట్టి మూడింటిలో ఏది వచ్చినా సంతోషంగా చేస్తానని నవీన్‌చక్రవర్తి తెలిపాడు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు తేదీలు ఖరారు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్మీడియెట్, పదవ తరగతి దూరవిద్య ఫలితాలు విడుదల చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మంగళవారం తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో సరిచూసుకోవాలని సూచించారు. ఫలితాలలో సందేహాలు ఉన్న విద్యార్థులు రీకౌంటింగ్‌కు ఒక్కొక్క సబ్జెక్ట్‌కు రూ.200, రీ–వెరిఫికేషన్‌కు సబ్జెక్ట్‌కు రూ.1000లు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 26వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. సప్లిమెంటరీకి హాజరయ్యే విద్యార్థులు ఈనెల 25వతేదీ లోగా అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించుకోవచ్చన్నారు. రూ.25లతో ఈనెల 29వ తేదీ వరకు, రూ.50లతో ఈనెల 31వతేదీ వరకు చెల్లించ వచ్చన్నారు. జూన్ 1, 2 తేదీలలో తత్కాల్ రుసుం క్రింద ఇంటర్‌మీడియెట్‌కు రూ.1000. పదవ తరగతికి రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కె.ఎం.ఏ.హుస్సేన్ (9441283674)ను సంప్రదించాలని తెలిపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి విడదల రజిని, వేదికపై బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, పల్నాడు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ఇదీ జగనన్న ఏలు'బడి'

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే

- జగనన్న హయాంలో విద్యార్థుల దిశ మారింది
- పేద విద్యార్థులకు చరిత్రలో తొలిసారిగా గుర్తింపు తెచ్చారు
- టెన్త్‌లో ప్రతిభావంతులకు ఆణిముత్యాలుగా గౌరవం
- సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత
- రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలి
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో విద్య, వైద్య, వ్యవసాయ, సాగు, తాగునీటిపై చర్చ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి పర్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫలితాల సాధనలో విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దారని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గుంటూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఉమ్మడి గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రజిని వైద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై జరిగిన చర్చలో మాట్లాడారు. ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ఎం. వేణుగోపాల్‌రెడ్డి, రంజిత్‌బాషా, పల్నాడు జేసీ శ్యాంప్రసాద్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు.

ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలి

వ్యవసాయ రంగంపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని, తద్వారా అధిక ధరలకు విత్తన విక్రయాలను నిరోధించాల్సి ఉందని సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయమై మంత్రి రజిని మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతులకు అవసరమైన మిర్చి, పత్తి తదితర పంటలకు సంబంధించిన అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వమే పూర్తి స్థాయిలో సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు జిల్లాల కలెక్టర్లు వ్యవసాయశాఖపై సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కోరిన విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.



హాజరైన ఎమ్మెల్యే కిలారు రోశయ్య ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, కె.ఎస్.లక్ష్మణరావు

వాచ్‌మెన్ల నియామకంపై హర్షం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సీఎం వైఎస్ జగన్‌ను కలిసి చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 5,388 మంది నైట్ వాచ్‌మెన్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేయడంపై హెనీ క్రిస్టినాకు అభినందనలు తెలిపారు. కల్తీ విత్తన విక్రేతలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కించడంపై నిలదీశారు. బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ముఖ్యంగా ప్రభుత్వ రంగ ఎస్‌బీఐ రుణాలు ఇవ్వడం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు.

నూతన ఎమ్మెల్సీలకు చోటు

జెడ్పీ స్థాయి సంఘాల్లో స్త్రీ–శిశు సంక్షేమంపై గల 5వ స్థాయి సంఘ సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, నారా లోకేష్ పదవీ కాలం ముగియడంతో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి యేసురత్నంను ఎన్నుకున్నట్లు హెనీ క్రిస్టినా ప్రకటించారు. అదే విధంగా తొలిసారిగా జెడ్పీ సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌తో పాటు బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను సన్మానించారు. సమావేశంలో మూడు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో అపూర్వ ఘట్టం

మంత్రి రజిని మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు వచ్చాయన్నారు. జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, అమ్మఒడితో పైసా ఖర్చు లేని నాణ్యమైన చదువులను చెప్పిస్తున్న ఫలితంగానే ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచారని, ఇది చరిత్రలోనే అపూర్వమైన ఘట్టమన్నారు. ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నగదు పురస్కారాలను ప్రదానం చేయడం అభినందనీయమన్నారు.

జెడ్పీ నిధులతో..

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆశాజనకమైన ఫలితాలు నమోదు కావడంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. రూ.61 లక్షల జెడ్పీ నిధులతో 36,155 మంది టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేసిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్, మరో రూ.50 లక్షలతో పంపిణీ చేసిన అల్పాహారం ఎంతో ప్రయోజనం చేకూర్చాయన్నారు.

గుంటూరు చానల్ పొడిగింపుపై..

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ గుంటూరు చానల్‌లో తూటికాడ పేరుకుపోయి నీరు నిలిచిపోతోందని సమావేశం దృష్టికి తెచ్చారు. అదే విధంగా వ్యర్థాలతో గుంటూరు చానల్ దుర్గంధ భరితంగా మారుతున్న దృష్ట్యా, పరిశుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరు చానల్ విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. గుంటూరు నగరాన్ని ఆనుకుని ఉన్న ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చబోతున్నామని, 60 ఏళ్లుగా నెలకొన్ని ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారాన్ని చూపించామని చెప్పారు. ఈనెల 27న లాంఛనంగా తాగునీటి సరఫరా ప్రారంభిస్తున్నామని తెలిపారు. పలువురు జెడ్పీటీసీలు సమావేశం దృష్టికి తెచ్చిన వివిధ సమస్యలపై అధికారులతో చర్చించారు.

జిల్లాపరిషత్ పాలకవర్గం ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, ఇకముందు చేపట్టబోయే అంశాలపై ప్రధానంగా చర్చించింది. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు ఏవిధంగా అభివృద్ధి చెందాయి, ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ, ఆర్బీకేల్లో అందుతున్న సేవలు వంటి అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు నేతలు, అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

వ్యవసాయానికి దన్ను

దేశంలో అగ్రగామిగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

- విద్యాబోధన, విస్తరణ, పరిశోధన రంగాల్లో సేవలు
- వ్యవసాయ అభివృద్ధి కోసం పరిశోధనలు
- ఇప్పటికే వరి, అపరాలు, పత్తి పై పరిశోధనలు
- 25 రకాల కొత్తవంగడాలు విడుదల
- ఏటా రైతులకు బ్రీడర్, ఫౌండేషన్ సీడ్ పంపిణీ
- జాతీయ స్థాయిలో పలు అవార్డులు



బాపట్ల వ్యవసాయ కళాశాల చదువుల క్షేత్రం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దన్నుగా నిలుస్తోంది. ఆరు దశాబ్దాలుగా వేల సంఖ్యలో వ్యవసాయ శాస్త్రవేత్తలను అందించింది. వారిద్వారా పలురకాల కొత్తవంగడాలు సృష్టించి రైతులకు అందించింది. తద్వారా పంటల్లో దిగుబడులు పెంచి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడింది.

కొత్తవంగడాల సృష్టి

విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాలలకు చెందిన శాస్త్రవేత్తలు పలురకాల కొత్తవంగడాలు సృష్టించారు. వరి, అపరాలు, పత్తి, ఇతర చిరుధాన్యాలపై పరిశోధనలు చేస్తున్నారు. 2021–22లో 25 రకాల వంగడాలు విడుదల చేశారు. వరిలో 11 రకాలు, రాగిలో రెండు, పత్తిలో ఐదు, పెసరలో రెండు తోపాటు కొర్రలు, మినుములు, శనగ తదితర వాటిలో సరికొత్త వంగడాలు రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ప్రధానంగా ప్రపంచ ప్రఖ్యాత బీపీటీ 5204 రకం సాంబామసూరి వంగడాన్ని తీసుకు వచ్చి వరి సాగులో నూతన విప్లవాన్ని తీసుకువచ్చింది. వీటితో పాటు పలురకాల పరిశోధన సంస్థల ద్వారా బ్రీడర్, ఫౌండేషన్ విత్తనాలను రైతులకు అందజేస్తున్నారు.

సబ్సిడీ యంత్రాలు..

వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసేందుకు అధునాతన యంత్రాలను సృష్టించి రైతులకు అందిస్తున్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలు యంత్ర పరికరాలను తయారు చేసి ప్రభుత్వం ద్వారా సబ్సిడీ ధరలకు అందిస్తున్నారు. దీంతో పాటు డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేసి డ్రోన్ ల ద్వారా పంటలకు పురుగు మందులు పిచికారీ చేయిస్తున్నారు. ఇందుకు గాను ఈ విశ్వవిద్యాలయం భారత వ్యవసాయ పరిశోధన మండలి నుంచి పురస్కారాలు అందుకుంది. దేశంలోనే మొదటగా గ్రామీణ అవగాహన కృషి అనుభవం కార్యక్రమం ద్వారా విద్యార్థులు గ్రామాలకు వెళ్లి రైతులతో కలిసి పనిచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు కోర్సు పూర్తి చేశాక కేవలం ఉద్యోగాలపై ఆధారపడకుండా సొంత వ్యాపార యూనిట్లు ప్రారంభించేలా వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఏటా 1267 మంది విద్యార్థులు ఏజీ బీఎస్సీ, 77 మంది ఏజీ బీటెక్, 77మంది ఫుడ్ సైన్స్ బీటెక్, 206 మంది ఏజీ ఎమ్మెస్సీ, 54 మంది విద్యార్థులు పీహెచ్‌డీ కోర్సుల్లో చేరుతున్నారు. డిప్లమా, యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో 2777 మంది ఉత్తీర్ణులయ్యారు. ఏజీ ఎమ్మెస్సీలో ప్రవేశానికి ఐసీఏఆర్ ప్రతి ఏటా నిర్వహించే పరీక్షల్లో ఇక్కడి విద్యార్థులు దేశంలో అత్యధిక జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లు సాధించి దేశంలో రెండో స్థానంలో నిలిచింది. అఖిల భారత వ్యవసాయ పరిశోధనా మండలి ప్రకటించిన ర్యాంకుల్లో జాతీయ స్థాయిలో 11 ర్యాంకు దక్కింది. వర్శిటీకి అనుబంధంగా 112 పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి.

విదేశీ శిక్షణకు విద్యార్థులు

ఏజీ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులను ఐసీఏఆర్ రెండు నెలల శిక్షణ నిమిత్తం అమెరికా, ఫిన్లాండ్, థాయిలాండ్ తదితర దేశాలకు పంపుతోంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1945లో జులై 16న బాపట్లలో వ్యవసాయ కళాశాల స్థాపించారు.1964 లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వావిద్యాలయంలో విలీనమైంది.

ఉన్నతస్థాయికి విద్యార్థులు

ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయి పదవుల్లో ఉన్నారు. పూర్వ విద్యార్థుల ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలకు ప్రతిఏటా పురస్కారాలు అందజేస్తున్నారు.

గ్రామీణ యువతను వ్యవసాయం వైపు మళ్లించే దిశగా..



ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలో కీర్తి పొందింది. విద్యాబోధన, విస్తరణ, పరిశోధన రంగాల్లో అత్యుత్తమ సేవలందిస్తోంది. ఇక్కడ చదివిన వారు శాస్త్రవేత్తలుగా, ఆచార్యులుగా అంకిత భావంతో సేవలందిస్తున్నారు. గ్రామీణ యువతను వ్యవసాయ రంగంలోకి ఆకర్షించడమే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.

– విష్ణువర్ధన్ రెడ్డి, వీసీ, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

రాజధానిలో పేదలు ఉండకూడదనేదే బాబు ఆలోచన

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

మంగళగిరి: పేద ప్రజలు రాజధానిలో ఉండకూడదనేదే చంద్రబాబు ఆలోచన అని, చంద్రబాబు చెంపచెళ్లు మనే విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వబోతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సీఆర్‌డీఏ పరిధి కృష్ణాయపాలెంలోని ఆర్–5 జోన్‌లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల లేఅవుట్ అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగా ర్జున మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన చంద్రబాబు చెంప చెళ్లు మనిపించే విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 50 వేల మందికి పైగా పేదలకు ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వనుండటం నిజంగా పేదల అదృష్టమన్నారు. ఆర్–5 జోన్‌లో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఎందుకు ఇవ్వకూడదో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానం రాష్ట్రంలో విరాజిల్లుతుందనేదానికి నిదర్శనం, నిలువుటద్దం రాజధాని ప్రాంతంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదురొడ్డి పేదలకు నివేశన స్థలాలు ఇవ్వడమేనన్నారు.

గత 967 రోజులుగా ఈ ప్రాంతంలో దళిత, బహుజనులు ఏకమై చంద్రబాబు తీరును వ్యతిరేకిస్తూ ఉద్యమం చేస్తున్నారని గుర్తు చేశారు.

ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షాలు పేదల సమస్యలపై పోరాడేవని, నేడు ప్రతిపక్షాలన్నీ కలసి అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని పోరాటం చేయడం ఎంత వరకు సమంజసమో వారి విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు.

ఓ సామాజిక వర్గం పక్కన అణగారిన వర్గాలు ఉండకూడదనేదే వారి ఆలోచన అని, సీఆర్‌డీఏలో భూములన్నీ చంద్రబాబు, లోకేష్‌లు వారి సొంత భూములు అయినట్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు.

ఐరిస్‌తో నిత్యావసరాలు


- రేషన్ సరుకుల పంపిణీలో ఇబ్బందులకు చెక్
- వేలిముద్రలు పడక ప్రతినెలా ఇక్కట్లు
- సరుకులు అందుకోలేకపోతున్న వేల కుటుంబాలు
- జిల్లాలో 402 ఎండీయూ వాహనాలకు ఐరిస్ మెషీన్లు
- జూన్ నుంచి కొత్త విధానాన్ని అమలు చేస్తామన్న జేసీ



ఐరిస్ మెషీన్ల వినియోగంపై ఎండీయూ వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాక్షి, నరసరావుపేట: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చింది. ఇంటింటికీ రేషన్ అందించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) అమల్లోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అక్కడక్కడా అలసత్వం, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న ఉద్దేశంతో గత డిసెంబర్ నుంచి ఎండీయూ వాహనాలకు జీపీఎస్ ట్రాకర్లు అమర్చి పంపిణీ చేస్తున్నారు. రేషన్ పంపిణీ విధానంలో మరో మార్పునకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు బయోమెట్రిక్ (వేలి ముద్రలు) ఆధారంగా రేషన్ పంపిణీ చేస్తోంది. ఐతే కొంతమంది 60 ఏళ్లుపై బడిన వారిలో వేలిముద్రలు ఈ–పోస్ మిషన్‌లో సరిపోకపోవడంతో నెలనెలా లబ్ధిదారులకు రేషన్ పంపిణీలో సమస్య ఎదురవుతుంది.

జిల్లాలో సుమారు 30 వేల మందికిపైగా కుటుంబాలు రేషన్ సరుకులు తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటి వరకు రేషన్ పంపిణీలో ఉన్న వేలిముద్రల స్థానంలో ఐరిష్ (కంటి గుర్తింపు) విధానం అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి పౌరసరఫరాల శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల అంటే జూలై నుంచి ఈ కొత్త విధానంలో రేషన్ పంపిణీ చేయనున్నారు.



ఐరిస్ పరికరం

జిల్లాలో మొత్తం రైస్ కార్డులు	6,36,468
రేషన్ దుకాణాలు	1,290
ఎండీయూ వాహనాల సంఖ్య	4028

402 ఐరిస్ యంత్రాలు పంపిణీ

బయోమెట్రిక్ విధానం ద్వారా ముఖ్యంగా దినసరి కూలీలు, ఇతర చేతి వృత్తుల పేదలు వేలి ముద్రలు కోల్పోతున్న పరిస్థితి ఉంది. బయోమెట్రిక్ ద్వారా మెషీన్‌లో వేలిముద్రలు పడక గంటల కొద్దీ నిరీక్షించినా ఫలితం లేని పరిస్థితి. వేలి ముద్రలు పడకపోవడంతో రేషన్ ఇచ్చేందుకు ఎండీయూ సిబ్బంది నిరాకరిస్తున్నారు. ఇటువంటి వారికి ఇకపై ఐరిస్ ఆధారిత ధ్రువీకరణతో రేషన్ పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు ప్రస్తుతం పల్నాడులో 6,36,468 మంది రైస్ కార్డుదారులు ఉండగా వారికి 402 ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. వీరి ప్రతి వాహనానికి ఒక ఐరిస్ మిషన్‌ను అందజేస్తున్నారు. ఈ పంపిణీ కార్యక్రమం నెలాఖరులోగా పూర్తి చేసి జూన్ నెల నుంచి వేలిముద్రలతో పాటు ఐరిస్ ఆధారిత ధ్రువీకరణను ప్రామాణికంగా తీసుకుని నిత్యావసరాలు, బియ్యం పంపిణీ చేయనున్నారు.

అర్హులందరికీ నిత్యావసర సరుకులు



బయోమెట్రిక్ విధానంతో జిల్లాలో కొంతమంది పేదలు నిత్యావసర సరుకులు తీసుకోవడంతో ఇబ్బందిపడుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల నుంచి వేలిముద్రలతో పాటు ఐరిస్ మిషన్లతో కంటిని పరీక్షించి సరుకులు పంపిణీ చేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిత్యావసర వస్తువులు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం.

– శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్

పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య

బల్లికురవ: కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 108 వాహన ఈఎంటీ కేఆర్ సుందర్, పైలెట్ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చెన్నుపల్లి గ్రామానికి చెందిన ధూపాటి బోడెయ్య (28) పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. వైద్యశాలకు తరలిస్తుండగా చనిపోయాడు.

ఆసియా కప్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారుడు శబరీనాథ్‌ను అభినందిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: గణపవరం చుండిరంగనాయకులు పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థి, చిలకలూరిపేటకు చెందిన శబరీనాథ్ ఆసియాకప్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆడే భారత జట్టుకు ఎంపికయ్యారు. జూన్ 25 నుంచి 28 వరకు జపాన్‌లో జరిగే పోటీల్లో మెన్స్ విభాగంలో పాల్గొననున్నారు. గణపవరం పాలిటెక్నిక్ కళాశాలలో 2013 నుంచి 16 వరకూ ఈసీఈ డిప్లమా ప్రథమ స్థానంలో పూర్తిచేసిన శబరీనాథ్ అనంతరం నెల్లూరులో విక్రమసింహపురి విశ్వ విద్యాలయంలో మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేశారు. ప్రస్తుతం చిలకలూరిపేటలోని బీఆర్‌జీ మున్సిపల్ హైస్కూలులో పీఈటీగా పనిచేస్తున్నారు.

క్రీడా నేపథ్యం..
శబరీనాథ్ సీఆర్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతూనే సాఫ్ట్‌బాల్‌లో మంచి ప్రావీణ్యం సాధించారు. ఇప్పటి వరకూ 27 టోర్నమెంట్లలో పాల్గొన్నారు. రెండుసార్లు గోల్డ్‌మెడల్, ఐదుసార్లు రెండోస్థానంలో, మూడుసార్లు మూడో స్థానంలో నిలిచారు. 2015లో కేరళలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్, 2016లో జలంధర్‌లో జరిగిన పోటీల్లో కాంస్యం, 2018లో మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించారు.

పలువురి అభినందనలు
అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన శబరీనాథ్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, పలువురు అభినందించారు. పోటీల్లో విజయం సాధించి భారతదేశ సత్తా చాటాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించకుంటే కఠిన చర్యలు

- ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ఆకస్మికంగా తనిఖీ
- ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు హామీ
- స్థలాల రిజిస్ట్రేషన్ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్


బాలింతతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

రాజుపాలెం: ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ హెచ్చరించారు. మండలంలోని రెడ్డిగూడెం పరిధిలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న బాలింతలను, వృద్ధులను అడిగి ఫ్యామిలీ డాక్టర్ విధానం గురించి తెలుసుకున్నారు. కొంతమంది సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ విధానంలో కనిపించకపోవడంతో డాక్టర్ రవితేజనాయక్‌ను ముందుగా సమావేశం ఏర్పాటు చేయలేదా, గ్రామ సచివాలయ అసిస్టెంట్ వెల్ఫేర్, మహిళా పోలీసు, వలంటీర్లు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ముందురోజు వలంటీర్ల ద్వారా సమాచారం అందించాల్సి ఉండగా సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, మహిళా పోలీసులు కలసి సమావేశం నిర్వహించి ప్రణాళికబద్ధంగా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో జిల్లా కలెక్టర్ డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం సక్రమంగా అమలు అయ్యేలా చూడాలని తహసీల్దార్ నళినిని ఆదేశించారు. అప్పటికే ఆర్‌అండ్ ఆర్ కాలనీ వాసులు అక్కడికి చేరి కలెక్టర్‌తో కొన్ని సమస్యలు విన్నవించుకున్నారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, రైతులు ఆర్‌అండ్‌ఆర్ కేంద్రంలో దేవాలయానికి కేటాయించిన స్థలం ఆక్రమించుకున్నారని, మాకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు కానీ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించలేదని వివరించారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ బాల వికాస్ సంస్థతో మాట్లాడి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఆక్రమించుకున్న స్థలం మీకు స్వాధీనం అయ్యేలా తహసీల్దార్ ద్వారా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా ప్రభుత్వానికి తెలియజేశామని చెప్పారు. అనంతరం రైతులకు ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను పరిశీలించి వెంటనే రైతులకు పంపిణీ చేయాలని ఏఓ వీరయ్యను ఆదేశించారు.

చిన్నారి ప్రతిభ
కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో నాలుగేళ్ల చిన్నారి జిల్లా కలెక్టర్ అడిగిన పలు ప్రశ్నలకు ధైర్యంగా సమాధానం ఇచ్చింది. ఆ చిన్నారి తెలివితేటలకు మంత్రముగ్ధుడైన జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అంగన్‌వాడీ టీచర్, ఆయాల పనితీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని ఏఈ నరసింహారావును ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంఈఓ మల్లికార్జునశర్మ, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల బసకు ప్రత్యేక ఏర్పాట్లు

- ఏపీ నుంచి 1813 మంది
- మదరసాలో ఏర్పాట్లను పరిశీలించిన డెప్యూటీ సీఎం అంజద్‌బాషా


భక్తుల బస ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం అంజద్‌బాషా

పెదకాకాని: హజ్ యాత్రకు ఆంధ్రప్రదేశ్ నుంచి బయలు దేరే భక్తులు బస చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఆదేశించారు. బసకు కేటాయించిన నంబూరు మదరసా (సిరాజుల్ ఉలూమ్ అరబిక్ కళాశాల)ను మంగళవారం పరిశీలించారు. జూన్ 7వ తేదీ నుంచి 22 వరకు రాష్ట్ర నలుమూలల నుంచి 1813 మంది భక్తులు హజ్ యాత్రకు బయలు దేరి వెళుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించారు. అంజద్‌బాషా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హజ్ వెళ్లే ప్రయాణికుల కోసం హైదరాబాద్‌లో హజ్ హౌస్ ఉండేదని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత మొట్టమొదటి సారిగా గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని నంబూరు మదరసాలో బసచేసి బయలు దేరతారన్నారు. ఇక్కడ నుంచి బస్సు లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి విమానంలో హజ్‌యాత్రకు పయనం అవుతారని చెప్పారు. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హజ్ యాత్రకు వెళుతున్న భక్తులకు ప్రయాణం భారం కాకుండా ఒక్కొక్కరి బ్యాంక్ అకౌంట్‌కు రూ.80 వేలు చొప్పున జమ చేశామన్నారు. వక్ఫ్‌బోర్డు సీఈఓ ఖాదర్‌వలి, హజ్ కమిటీ చైర్మన్ గౌసమ్‌అజామ్, రాష్ట్ర మైనార్టీ సలహాదారుడు ఎస్‌ఎం జియావుద్దీన్, హజ్ కమిటీ డైరెక్టర్ బాసిత్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్‌ఎం సుభాని ఉన్నారు.

కార్మికుడి తలపైకి ఎక్కిన మిక్సర్ లారీ

అక్కడికక్కడే దుర్మరణం
మేదరమెట్ల: లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్ల పొట్టకూటి కోసం వచ్చిన ఓ కార్మికుడి నిండు ప్రాణం బలయ్యింది. ఈ ఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల జాతీయ రహదారి పక్కన ఉన్న భ్రమరా టౌన్‌షిప్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో సోమవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పురులియా జిల్లా గొల్పెర గ్రామానికి చెందిన ఖాసీం అన్సారీ (19) టౌన్‌షిప్‌లో గత ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. అదే క్రమంలో టౌన్‌షిప్‌లో సోమవారం రాత్రి సిమెంటు రోడ్లు వేసే క్రమంలో సిమెంట్ మిక్సర్ లారీ ఆలస్యంగా వచ్చింది. పనులు చేస్తున్న ఖాసీం అన్సారీతో పాటు మరో ఇద్దరు కార్మికులు అక్కడే నిద్రపోయారు. అటుగా వచ్చిన మిక్సర్ లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహరించడం వల్ల నిద్రిస్తున్న ఖాసీం తలపై ఎక్కింది. ఖాసీం అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే నిద్రిస్తున్న మరో ఇద్దరు ఒక్కసారిగా వచ్చిన శబ్దానికి ఉలిక్కిపడి నిద్రలేచి పక్కకు తప్పుకున్నారు. వారు బతికి బయట పడ్డారు. మేదరమెట్ల ఎస్సై పీ శివనాగిరెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతుడికి తొమ్మిది మాసాల కిందటే వివాహం జరిగినట్లు సమాచారం.

గుండెపోటుతో ఏఎస్సై మృతి


హసన్ సాహెబ్ (ఫైల్)

కొనకనమిట్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న షేక్ హసన్ సాహెబ్(58) గుండెపోటుతో మృతి చెందారు. పొదిలిలో నివాసం ఉండే హసన్‌సాహెబ్ సోమవారం రాత్రి ఊపిరి ఆడటం లేదని చెప్పటంతో బంధువులు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, పొదిలి సీఐ రాఘవేంద్ర, కొనకనమిట్ల ఎస్ఐ దీపిక, స్టేషన్ సిబ్బంది హసన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. హసన్ సాహెబ్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన బాపట్ల జిల్లా జె.పంగులూరు తీసుకెళ్లి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. హసన్‌సాహెబ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం రాష్ట్ర కొత్త కార్యవర్గం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం తృతీయ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు మంగళవారం గుంటూరు బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని అన్నమయ్య గ్రంథాలయంలో జరిగాయి. రాష్ట్ర అధ్యక్షునిగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య (గుంటూరు జిల్లా), ప్రధాన కార్యదర్శిగా చలపాక ప్రకాష్ (ఎన్టీఆర్ జిల్లా), కోశాధికారిగా నానా (నారిశెట్టి సత్యనారాయణ (గుంటూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి (గుంటూరు), పొన్నూరి వేంకటశ్రీనివాసులు (ప్రకాశం), పి.హరికృష్ణారెడ్డి (చిత్తూరు), ఎ.జయప్రకాష్ (పీఎస్ఆర్ నెల్లూరు), ఎస్ఆర్ పృథ్వీ (తూ/గో జిల్లా), రాధేయ (అనంతపురం), మాధవీ సనారా (అనకాపల్లి జిల్లా), కార్యదర్శులుగా ఎస్‌ఎం సుభాని (గుంటూరు), కె.జె.రమేష్ (పల్నాడు జిల్లా), సి.ఎ.చంద్రశేఖర్ (చిత్తూరు), బుర్రి కుమార్ రాజా (శ్రీకాకుళం), పి.లక్ష్మణరావు (విజయనగరం), సిహెచ్.శర్మ (ఎన్టీఆర్ జిల్లా), కార్యవర్గ సభ్యులుగా ఎస్.ఖాసీంబి (గుంటూరు), కోపూరి పుష్పాదేవి (ఎన్టీఆర్ జిల్లా), ఎం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి (ప/గో జిల్లా), సలహా మండలి సభ్యులుగా అడిగోపుల వెంకటరత్నం (చిత్తూరు), కాటూరు రవీంద్రత్రివిక్రమ్ (ఎన్టీఆర్ జిల్లా), గబ్బిట దుర్గాప్రసాద్ (కృష్ణా) ఎన్నికయ్యారు. 2023-2026 వరకు కార్యవర్గం పదవీ బాధ్యతల్లో కొనసాగుతారు.

ఏఎన్‌యూ ఫొటోగ్రాఫర్‌కు అసోసియేట్ హానర్ అవార్డు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫొటోగ్రాఫర్ జి.సునీల్ కుమార్‌కు లండన్ వేదికగా కొనసాగుతున్న బ్రిటిష్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ 'అసోసియేట్ హానర్' అవార్డు ప్రదానం చేసింది. విశేష ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్లకు ఈ సొసైటీ ఏటా పురస్కారాలు ప్రదానం చేస్తోంది. ఈ ఏడాది ఏఎన్‌యూ ఫొటోగ్రాఫర్‌ను ఈ అవార్డుకు ఎంపిక య్యారు. ఒడిశాలోని కోరాపుట్, కైరాపూట్ కొండలపై నివసించే పురాతనమైన 'బోండా' గిరిజన తెగ ప్రజల జీవనశైలిని ప్రతిబింబించే ఫొటోలను తన కెమెరాలో బంధించడమే కాకుండా సునీల్‌కుమార్ వాటితో ప్రత్యేకంగా డాక్యుమెంటరీని రూపొందించారు. దీనిని చూసి ముగ్ధులైన బ్రిటిష్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ న్యాయమూర్తులు, అధ్యక్షుడు సెమన్ అవార్డుకు సునీల్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ఏఎన్‌యూలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ బి.కరుణ అవార్డు గ్రహీతను అభినందించారు. జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత, అధ్యాపకురాలు డాక్టర్ జ్యోతిర్మయి, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ టి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బిర్యానీకి పంపి కారు అపహరణ

- డ్రైవర్‌ను హోటల్‌లోకి పంపి వాహనంతో ఉడాయింపు
- అపహరించిన ఫోన్‌తో కారు బుక్ చేసుకున్న దొంగ
- మూడు రోజుల కిందట నరసరావుపేటలో ఘటన
- కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు



దొంగిలించబడ్డ కారు

నరసరావుపేటటౌన్: డ్రైవర్‌ను బిర్యానీ తీసుకు రమ్మని పంపి వాహనాన్ని అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విజయవాడకు చెందిన మహదేవ్ కార్ ట్రావెల్స్‌కు అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి తన పేరు ఎస్‌వీ రావు అని నరసరావుపేట వెళ్లేందుకు వాహనం కావాలని బాడుగ కుదుర్చుకున్నాడు. దీంతో ఈనెల 20వ తేదీన గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో అతన్ని ఎక్కించుకొని నరసరావుపేట వచ్చారు. స్టేషన్ రోడ్డు గాంధీపార్క్ వద్ద తాను కారులోనే ఉండి ఏసీ ఆన్‌లో ఉంచమని చెప్పి బిర్యానీ తీసుకురావాలని డ్రైవర్ షేక్ షాజీద్‌కు డబ్బులు ఇచ్చి పంపాడు. బిర్యానీ తీసుకొని వచ్చే లోపు వాహనంతో దొంగ ఉడాయించాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వాహనం హైదరాబాద్, తిరుపతి మార్గంలో పయనించిందని తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి గాలిస్తున్నారు. మహదేవ్ కార్ ట్రావెల్స్ యాజమాన్యం ప్రభుత్వంలోని ప్రముఖులకు ఎస్కార్ట్ వాహనాలను కాంట్రాక్ట్ పద్ధతిన అందిస్తుంటారు. దొంగిలించబడ్డ వాహనంపై గవర్నమెంట్ వెహికిల్ అని రాసి ఉన్నట్లు తెలుస్తుంది.

దొంగలించిన సెల్‌ఫోన్‌తో కారు చోరీ
కారు బుక్ చేసేందుకు వినియోగించిన ఫోన్ నెంబర్ ఆరా తీసిన పోలీసులకు నిందితుడి మరో దొంగతనం బయటపడింది. సెల్‌ఫోన్‌ను దొంగిలించి ఆ ఫోన్‌తో వాహనాన్ని బుక్ చేసినట్లు తెలుసుకున్నారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా రెండు బృందాలుగా పోలీసులు విడిపోయి నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఎంతో చాకచక్యంగా రెండు చోరీలకు పాల్పడిన నిందితుడు పట్టుబడితే మరిన్ని నేరాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

పకడ్బందీగా ఈ-హెల్త్ రికార్డులు


హెల్త్ రికార్డుల వివరాలను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరావు

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలో ఈ-హెల్త్ రికార్డ్స్ పకడ్బందీగా నిర్వహించేందుకు డాక్టర్లు, సిబ్బందికి మరోసారి తగిన శిక్షణ ఇస్తామని ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ) కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం పల్నాడు రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల, కలెక్టరేట్ సమీపంలోని 200 పడకల డాక్టర్ వైఎస్సార్ కొత్త ప్రభుత్వ వైద్యశాలలను సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ల్యాబ్ పనితీరు, డయాలసిస్ యూనిట్ ఏర్పాటుచేసే ప్రదేశాన్ని పరిశీలించారు. వైద్యశాలల్లో ఈ-హాస్పిటల్ ద్వారా రోగులకు అందుతున్న సేవల గురించి వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, వైద్యులతో చర్చించారు. ఈ విధానం పకడ్బందీగా అమలుకోసం 22 కంప్యూటర్లు, ఏడు ప్రింటర్లు అందజేసి ఏపీ ఫైబర్ నెట్ నుంచి ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. దీనిలో ప్రస్తుతం 200 ఓపీలనే నమోదు చేయటాన్ని గమనించి ఇంకా వాటి సంఖ్యను పెంచాలని కోరారు. అలాగే పాత వైద్యశాలలో అపోలో సౌజన్యంతో నిర్వహిస్తున్న డయాలసిస్ యూనిట్‌ను నూతన హాస్పిటల్‌లోకి మార్చాలనే ప్రభుత్వ వైద్యుల ప్రతిపాదన మేరకు నూతన వైద్యశాలలో మూడో అంతస్తులోని ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించారు. అందుకు తగిన ఏర్పాట్లను చేసుకోవాలని అపోలో యాజమాన్యాన్ని కమిషనర్ కోరారు. నూతన హాస్పిటల్‌లో ఒకేసారి 640 వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాటుచేసిన పూర్తి ఆటోమేటెడ్ ల్యాబ్ పనితీరును పరిశీలించారు. ఇంకా పూర్తిస్థాయిలో పని చేసేందుకు కావాల్సిన సూచనలను సంబంధిత డాక్టర్లు, సిబ్బందికి ఇచ్చారు. ప్రభుత్వం నుంచి కావాల్సిన సదుపాయాలను పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు వేళాయె

నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఉద్యోగోన్నతులకు సీనియార్టీ జాబితా విడుదల
- ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన బదిలీలు, ఉద్యోగోన్నతులు
- లాంగ్ స్టాండింగ్‌లో బదిలీ కానున్న 1,500 మంది ఉపాధ్యాయులు


పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

గుంటూరుఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పాఠశాల విద్యాశాఖాధికారుల కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టనున్నారు. లాంగ్ స్టాండింగ్ విభాగంలో అన్ని కేడర్ల ఉపాధ్యాయులు బదిలీ కోరుతూ బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో విధిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. పరస్పర బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. బుధ, గురు, శుక్రవారాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేచోట ఐదు విద్యా సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రధానోపాధ్యాయులతోపాటు ఎనిమిది విద్యాసంవత్సరాలు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు లాంగ్ స్టాండింగ్ విభాగంలో తప్పనిసరిగా బదిలీ కానున్నారు. లాంగ్ స్టాండింగ్‌లో 1,500నుంచి రెండు వేల మందికి స్థాన చలనం కలుగనుంది. జీరో సర్వీసుతో అవకాశం కల్పించడంతో రిక్వెస్ట్ బదిలీ కోరుకునే ఆశావహులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసే అవకాశాలున్నాయి. ఒక వైపు బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న విద్యాశాఖాధికారులు మరోవైపు ఉద్యోగోన్నతులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూ రు జిల్లా పరిధిలో అన్ని కేడర్ల వారీగా ఉద్యోగోన్న తులకు అర్హులైన ఉపాధ్యాయులతో సీనియార్టీ జాబితాను విడుదల చేసి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు గుంటూరు డీఈఓ పి.శైలజ మంగళవారం తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న ఉపాధ్యాయులందరూ ఉద్యోగోన్నతికి అర్హులేనని, ఉద్యోగోన్నతి పొందుటకు సుముఖంగా లేని వారు ఈనెల 28వ తేదీలోగా రాత పూర్వకంగా తెలియపర్చాల్సి ఉందని స్పష్టంచేశారు. ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన బదిలీ దరఖాస్తులను ఈనెల 27వ తేదీలోగా ఆర్జేడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని సూచించారు. లాంగ్‌స్టాండింగ్‌లో తప్పనిసరి బదిలీ కావాల్సిన వారితో దరఖాస్తు చేయించాల్సిన బాధ్యత డీడీవోలదేనని పేర్కొన్నారు.